@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 25, మే 2024 || పేజీలు: 04



## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు
# ఈసీ అనుమతి

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు..**
**పండుగను తలపించేలా ఏర్పాట్లు..**
**అధికారులతో సమీక్షలో సీఎస్ శాంతి కుమారి**

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే 24:

**జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ** దినోత్సవాలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అనుమతిచ్చిన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ వేడుకల కోసం చేపట్టాల్సిన చర్యలపై శుక్రవారం ఆమె సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో డీజీపీ రవి గుప్తాతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, సీనియర్ ఐఏఎస్ అధికారులు బి.వెంకటేశం, జితేందర్, క్రిస్టినా జోంగ్తు, వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, టీజీపీడీసీఎల్ ఎండీ ముషారఫ్, సీడీఎంఏ దివ్య, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఎం.హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు. శాంతికుమారి మాట్లాడుతూ ఆవిర్భావ వేడుకల సందర్భంగా వీఐపీలు ప్రయాణించే మార్గాల్లో తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ట్రా ఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి పార్కింగ్ స్థలాలను కేటాయించాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రజలకు ఎండ తగలకుండా బారికేడింగ్‌తో పాటు నీడ కోసం మిగతా 2లో..



## అన్నిరకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

- ఖమ్మం పర్యటనలో హరీష్ రావు డిమాండ్

నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-మే24:

అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సన్నవడ్లు, దొడ్డు వడ్లని కాకుండా అన్నిరకాల వడ్లకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లాలో మిగతా 2లో..



## దేశాభివృద్ధికి పాటుపడే వారికే
# ఓటెయ్యండి

**మేము ఎప్పుడూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**
**ఏడోదశ ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ పిలుపు**

నేటి ఫోకస్ న్యూస్, సిమ్లా-మే24:

**దేశాభివృద్ధికి పాటు పడే** వారికే ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అభివృద్ధి జరగాలనుకునే వారు తప్పకుండా బీజేపీకి మద్దతు ఇస్తారని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో గతంతో పోల్చితే ఎక్కువ స్థానాల్లోనే బీజేపీ గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి ఎన్ని కుట్రలు చేసిన వారు అధికారంలోకి రావడం కల.ని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'హిమాచల్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మిగతా 2లో..



## మల్లారెడ్డికి మరో షాక్!

- బొమ్మరాసిపేట పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో
- రెండేళ్ల క్రితం ఆరెకరాల పట్టా భూమి కొనుగోలు
- చుట్టూ ఆర్నెల్ల క్రితం ప్రహరీ నిర్మాణం
- ఫిర్యాదుతో కూల్చివేసిన అధికారులు

నేటి ఫోకస్ న్యూస్, శామీర్‌పేట-మే 24:

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరో షాక్ తగిలింది. మొన్నటికి మొన్న సుచిత్రలోని భూ వివాదం తాలూకు కాక చల్లారక ముందే తాజాగా బొమ్మరాసిపేట గ్రామ పరిధిలోని ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఆయన మిగతా 2లో..



## ప్రపంచస్థాయి నగరాల్లో
# హైదరాబాద్

- ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ 2024

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే24:

**దేశంతో పాటు** అంతర్జాతీయంగా హైదరాబాద్ ఖ్యాతి రోజు రోజుకు పెరుగుతోంది. ఐటీ, ఫార్మా రంగాలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి పరిస్థితులు హైదరాబాద్‌ని మరింత విశిష్టంగా మారుస్తున్నాయి. మిగతా 2లో..



## అమిత్‌షాకు లైన్ క్లియర్ చేస్తున్న మోడీ

- అందుకోసం సీనియర్లకు మొండిచేయి
- ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ వ్యాఖ్య

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే24:

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ స్పష్టం చేశారు. అమిత్ షాను ప్రధానిని చేయడం కోసం.. ఆ పార్టీలోని సీనియర్ నేతలు మిగతా 2లో..

## అన్ని వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా!

- రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం
- ఎన్ఎంసీ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి అమలు
- ప్రభుత్వ కాలేజీల్లోని అన్ని ఎంబీబీఎస్ సీట్లలో 10% కేటాయింపు
- ప్రైవేట్ కాలేజీల్లోని సగం కన్వీనర్ కోటా సీట్లలో 10%..
- ఇప్పటివరకు 7 కాలేజీల్లోని 103 సీట్లు మాత్రమే వారికి..
- ప్రతిపాదన అమలైతే ఈ కేటగిరీలో అదనంగా 350 సీట్లకు చాన్స్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:



రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయిం చింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచే రిజర్వేషన్లు అమలు చేయ నుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అన్ని సీట్లలో 10 శాతం, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని (మైనారిటీ కాలేజీలు మినహా) సగం కన్వీనర్ కోటా సీట్లలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోసం కేటాయించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఈ మేరకు అందిన ప్రతిపాదనకు ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా 2లో..



## మోసపోతే గోసపడతరు

- అయినా మార్పు కావాలని కాంగ్రెసను గెలిపించారు
- హత్యా రాజకీయాలకు తెరతీసిన రేవంత్ సర్కార్
- ఉచిత బస్సు హామీ తప్ప ఇంకేమీ చేయలేదు: కేటీఆర్

నేటి ఫోకస్ న్యూస్, యాదాద్రి/హైదరాబాద్, మే 24:

"మోసపోతే గోస పడతారని, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దని అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినప్పటికీ వినలేదు. కాంగ్రెసనే గెలిపించారు. రేవంత్ సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా హత్యా రాజకీయాలు చేస్తోంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దామెరలో, నల్లగొండ జిల్లా దేవరకొండ, నకిరేకల్‌లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మిగతా 2లో..

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్

- కేరళ యువకుడి మృతితో రట్టు
- సూత్రధారి ప్రైవేట్ డాక్టర్‌గా గుర్తింపు

2





## జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- జూలై 12న తొలి దశ సీట్ల కేటాయింపు
- 19 నుంచి రెండో దశ కౌన్సెలింగ్
- 3దశల్లో కౌన్సెలింగ్..షెడ్యూల్ విడుదల

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 24:

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ వెల్లడైంది. ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి మొత్తం మూడు దశల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

శనివారం 25, మే 2024

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి

(మొదటి పేజీ తరువాయి..)

షామియానాలను ఏర్పాటు చేసే బాధ్యతలను ఆర్అండ్బీ శాఖకు అప్పగించారు. సభా ప్రాంగణ ప్రాంతాల్లో పారిశు ధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను, నిరంతరాయంగా విద్యు త్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. సీఎం రేవంత్గన్పార్క్ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పరేడ్గ్రౌండ్కు చేరుకుంటారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

## మల్లారెడ్డికి మరో షాక్!

(మొదటి పేజీ తరువాయి..)

అక్రమంగా నిర్మించిన ప్రహరీ తెరమీదకొచ్చింది. ఈ ప్రహరీని శు క్రవారం అధికారులు కూల్చివేశారు. రంగారెడ్డి జిల్లా శామీర్పేట మండలం బొమ్మరాసిపేట పరిధిలోని పెద్ద చెరువు ఎఫ్టీఎల్, బఫర్జోన్లలోని సర్వే నంబర్–408లోని ఆరు ఎకరాల పట్టా భూమిని రెండేళ్ల క్రితం మల్లారెడ్డి కొన్నారు.. ఏడాది క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆరు నెలల క్రితం ఆ భూమికి చుట్టూ ప్రహరీని నిర్మించారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోని భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఈ క్రమంలో స్థానిక ప్రజలు, మల్లారెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం పెద్దచెరువు పరిధిలోని ఎఫ్టీఎల్, బఫర్జోన్లలో మల్లారెడ్డి నిర్మించిన ప్రహరీని కూల్చివేయాలని కలెక్టర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు శుక్రవారం ఉదయం 7 గంటలకు అధికారులు సిబ్బంది.. యంత్రాలతో బొమ్మరాసిపేటకు వెళ్లారు. పెద్ద చెరువు సమీపంలో మల్లారెడ్డికి చెందిన పట్టా భూమిలో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోని ప్రహరీని కూల్చివేయించారు. కాగా పెద్ద చెరువు బఫర్జోన్ పరిధిలోని 408, 407 సర్వే నంబర్లలో పోలీసు శాఖలోని నలుగురు అధికారులు వెయ్యి గజాల చొప్పున కొనుగోలు చేసి అక్రమంగా ప్రహరీలను నిర్మించారు. స్థానికుల ఫిర్యాదుతో ఈ గోడలనూ అధికారులు కూల్చివేశారు.

**సుచిత్ర భూవివాదంలో లభించని ఊరట..**

సుచిత్ర పరిధిలోని ఓ భూవివాదంలో హైకోర్టును ఆశ్రయించినా మల్లారెడ్డికి ఊరట లభించలేదు. కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామంలో 82, 83 సర్వేనంబర్లలోని 2.14 ఎకరాల విషయంలో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారు జోక్యం చేసుకోకుండా ఆదేశిలివ్వాలని కోరు తూ హైకోర్టులో మల్లారెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, కుమారుడు మహేందర్ రెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ అనిల్కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ వివాదంలో ఉన్న భూమిని 2011లో మల్లారెడ్డి కొనుగోలు చేసి, లీజుకు ఇచ్చారని, ఈనెల 18న కుత్బుల్లాపూర్ తహసీల్దార్ తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసుల సహాయంతో సర్వే చేపట్టారని పేర్కొన్నారు. కొంతమంది సంఘవ్యతిరేక శక్తులు భూ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సదరు భూమిపై సివిల్ కేసులు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఆదేశాలివ్వలేమని, సంబంధిత రికార్డులు, కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## హైదరాబాద్లో కిడ్నీ రాకెట్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–మే24:**

నగరంలో మరో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయ్యింది. కేరళకు చెందిన యువకుడి మృతితో ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కీలక సూత్రధారి హైదరాబాద్కుచెందిన వైద్యుడిగా గుర్తించారు. కొంతకాలంగా పేదలకు డబ్బు ఆశ చూపి విదేశాలకు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేస్తూ దందా సాగిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడు మృతిచెందడంతో ఈ వ్యవహారం బయటకొచ్చింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. కేరళలో ఓ యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఈ మధ్యనే కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడని, అందుకు దళారులు రూ.20లక్షలు ఆశ చూపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సబిన్ అనే దళారిని కోచి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టులో అదుపులోకి తీసుకుని విచారించారు. కీలక సూత్రధారులు హైదరాబాద్కు చెందిన డాక్టర్, మరో ముగ్గురు కలిసి దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. యువకుడిని ఇరాన్ తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేశారని, రూ.20లక్షలు ఇస్తామని చెప్పి రూ.6లక్షలే ఇచ్చినట్లు దర్యాప్తులో తేలినట్లు కేరళ పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా కేరళ పోలీసులు హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40మంది యువకులను ఇరాన్ దేశం తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువమంది పేదలే ఉన్నట్లు వారు తెలిపారు. నగరానికి చెందిన ఒక వైద్యుడితోపాటు మరో ఇద్దరు దళారుల కోసం కేరళ పోలీసులు వెతుకుతున్నారు. కేరళలోని ఎర్నాకులం కేంద్రంగా వ్యవహారం నడుపుతున్నారని, పేదలను టాట్ చేసుకుని నగదు ఆశ చూపి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని కేరళ పోలీసులు పేర్కొన్నారు

## అమిత్షాకు లైన్ క్లియర్ చేస్తున్న మోడీ

(మొదటి పేజీ తరువాయి..)

శివరాజ్ సింగ్, వసుందర రాజే, ఖతర్ సాహెబ్, డాక్టర్ రమణ్ సింగ్లను పక్కన పెట్టారని ఆరోపించారు. నేడో రేపో యూపీ ప్రస్తుత సీఎం యోగి ఆధిత్యనాథ్ను సైతం పక్కన పెడతారన్నారు. అందుకు సంబంధించిన ప్రచారం సైతం ఇప్పటికే ప్రారంభ మైందని చెప్పారు. శు క్రవారం న్యూఢిల్లీలో మీడియాకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేజీవ్రాల్ మాట్లాడారు. 2019లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేజీవ్రాల్ గుర్తు చేశారు. బీజేపీలో 75 ఏళ్లు వచ్చినా.. ఆ వయస్సు దాటిన నాయకులంతా తప్పకుండా రిటైర్ కావాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారన్నారు. అందులో ఎటువంటి రాజీ లేదని అమిత్ షా చెప్పారన్నారు. కావాలంటే.. నాడు అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు.. ఇంటర్నెట్లో చెక్ చేసుకోవచ్చునంటూ కేజీవ్రాల్ సూచించారు. అయితే ఆ రూల్ ప్రకారమే బీజేపీలోని సీనియర్లు ఎల్ కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్ తదితరులంతా పార్టీ నుంచి తప్పుకున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో బీజేపీలో ప్రస్తుతమున్న నాయకాగణం సైతం ఆ రూల్ ప్రకారం నడుచుకోవాల్సిందేనని కేజీవ్రాల్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 21న ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన తీహాడ్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరఫున ప్రచారం చేసుకోవాలంటూ సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ వేశారు. నేపథ్యంలో కేజీవ్రాల్కు సుప్రీంకోర్టు ఇటీవల కండిషన్లతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఢిల్లీలోని తన పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బీజేపీ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని కేజీవ్రాల్ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

# దేశాభివృద్ధికి పాటుపడే వారికి ఓటేయండి

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోవట్లేదు. వారికెప్పుడు వారసత్వ రాజకీయాలు, అవినీతి, అక్రమాలు చేయడంపైనే ధ్యాస ఉంటుంది. సిమ్లాకు రావడం నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికో ప్రధాని మారుతారు. కాంగ్రెస్ మతాలు, కులాల మధ్య చిచ్చు రేపి లబ్ది పొందాలని ప్రయత్నిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేసి మైనారిటీలకు ఇవ్వాలని చూస్తోంది. పశ్చిమ బెంగాల్లో అలాగే చేయాలని ప్రయత్నించడంతో కోల్కతా హైకోర్టు దీదీ సర్కారుకు మొట్టికాయలు వేసింది. రిజర్వేషన్లను రద్దు చేయాలని ఇండియా కూటమి ప్రయత్నిస్తోంది. వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి. రానున్న ఎన్నికల్లో బీజేపీకి అఖండ విజయాన్ని కట్టబెట్టాలని మోదీ ఓటర్లను కోరారు. ఆరో దశ లోక్ సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఆయా పార్టీల అధినేతలు ఏడో దశ ఎన్నికలపై దృష్టి పెట్టారు. దేశ వ్యాప్తంగా జూన్ 1న ఏడో దశ పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న



హిమాచల్లో మోదీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన ఇవాళే ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న పంజాబ్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. హిమాచల్ ప్రదేశ్లో మొత్తం 57,11,969 మంది ఓటర్లు ఉన్నారని ప్రధాన ఎన్నికల అధికారి మనీష్ గార్గ్ తెలిపారు. 2019లో 53,30,154 మంది ఉండగా



3,81,815 మంది ఓటర్లు పెరిగారని వెల్లడించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని నాలుగు లోక్సభ నియోజకవర్గాలను కైవసం చేసుకున్న బీజేపీ ఈసారి అన్ని సీట్లల్లో పాగా వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## అన్ని వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా!

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 7 ప్రభుత్వ వైద్య కళాశాలలు.. హైదరాబాద్లోని గాంధీ, ఈఎస్ఐ మెడికల్ కాలేజీలు, మహబూబ్నగర్, నిజామాబాద్, సిద్దిపేట మెడికల్ కాలేజీలు, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్లోని రాజీవ్గాంధీ మెడికల్ కాలేజీల్లోనే ఎన్ఎంసీ అనుమతి మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. గతేడాది వరకు ఆయా కాలేజీల్లో 103 ఎంబీబీఎస్ సీట్లు ఈ కోటా కింద అగ్రవర్ణాల్లోని పేదలకు ఇచ్చారు. కాగా ఈ ఏడాది నుంచి అన్ని మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ను అమలు చేస్తే మరో 350 వరకు ఎంబీబీఎస్ సీట్లు అగ్రవర్ణ పేదలకు దక్కే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత, అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్కు సంబంధించిన ఉత్తర్వులు వెలువడుతాయని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

**జనరల్ కోటా సీట్లకు గండి..:** రాష్ట్రంలో గతేడాది వరకు 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అయితే ఇప్పటివరకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుకు గాను అంతే మొత్తంలో సీట్లను ఆయా మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ మంజూరు చేసింది. దీనివల్ల ఇతర రిజర్వేషన్ కేటగిరీ విద్యార్థులకు కానీ, జనరల్ కేటగిరీ కోటా సీట్లకు కానీ కోత పడేది కాదు. కానీ తాజాగా ఎన్ఎంసీ అదనపు సీట్లు మంజూరు చేయడం కుదరదని, ఉన్న సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశించింది. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి కోత ఉండదని అంటున్నారు. అంటే జనరల్ కేటగిరీ సీట్లకు కోత పెట్టి వాటిని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్కు కేటాయిస్తారు. అలాగైనా తమకు నష్టం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అంటున్నారు. జనరల్ కేటగిరీలోనూ తమకు ప్రతిభ ప్రకారం రావాల్సిన సీట్లకు గండి పడుతుందని, దీనివల్ల తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో భారీగా నకిలీ విత్తనాల పట్టివేత

### ఆదిలాబాద్, జడ్జర్లలో దాడులు – పలువురి అరెస్ట్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–మే24:**

రాష్ట్రంలో నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎక్కడ సమాచారం వచ్చినా వెంటనే అరికట్టి, నకిలీ విక్రేతలను అరెస్ట్ చేస్తోంది. తాజాగా ఆదిలాబాద్ పట్టణంలో,జడ్చర్లలో నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రం గుట్టురట్టయింది. శుక్రవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ రాంనగర్ ప్రాంతంలో గోదాంలో నకిలీ విత్తనాలు తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివిధ కంపెనీలకు చెందిన 945 పత్తి విత్తనాల ప్యాకెట్లతో పాటు 50 కిలోల విడి పత్తి విత్తనాలు, 330 బ్యాగులు జొన్న విత్తనాలు, నకిలీ విత్తనాల తయారీకి ఉపయోగించే కలర్, కెమికల్ను పట్టుకున్నారు. వీటి విలువ రూ.19,39,908 ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. విత్తన కేంద్రం నిర్వాహకుడు సామ అశోక్ రెడ్డితో పాటు అందులో పనిచేసే మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో నకిలీ పత్తి విత్తనాలుపట్టుబడిన ఘటన చోటు చేసుకున్నది. జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 2.21 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఈ క్రమంలో జడ్చర్ల పోలీస్స్టేషన్లో శుక్రవారం ఏఎస్పీ రాములు విలేకరులతో మాట్లాడారు. గోప్లాపూర్లో ప్రభాకర్రెడ్డి, సుధాకర్రెడ్డి నకిలీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు విత్తనాలు నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 2.21 క్వింటాళ్లు నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారని తెలిపారు. విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సమావేశంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, వ్యవసాయాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

## సోనియాను ఏ హోదాలో ఆహ్వానిస్తారు

- కాంగ్రెస్ మయాంలో పరాయి పాలన
- ప్రతిదీ ఢిల్లీ ఆదేశాల మేరకు చేయాల్సిందే
- మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, సూర్యాపేట–మే24:**

జూన్ 2న సోనియా గాంధీని ఏ హోదాలో రాష్ట్రానికి పిలుస్తారని సూర్యాపేట శాసనసభ్యుడు జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం మళ్లీ పరాయి పాలనలోకి వెళ్లిందని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శు క్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో సగం పాలన ఢిల్లీ నుంచి చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్న ఢిల్లీలో అనుమతి తీసుకుని చేయాలి. రాష్ట్ర హక్కులు, నదీ జలాలను హరిస్తున్నారని విమర్శించారు. పదేళ్లుగా ఎంతో బాగా పాలన చేశాం. 2014 జూన్ రెండు నుంచి 2023 డిసెంబర్ వరకు తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ వాళ్లు పరిపాలించుకున్నారు. మళ్లీ దురదృష్టవశాత్తు పరాయి పాలన వచ్చి ఢిల్లీపై ఆధార పడాల్సిన దురదృష్టం వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కరెంట్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సెల్ఫోన్ లైట్లతో హాస్పిటల్స్లో ఆపరేషన్లు చేస్తున్న విషయాలు పత్రికల్లో వచ్చాయంటే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దాడులు చేసి అక్రమ కేసులు పెట్టినా తెలంగాణ ప్రజలకు పోరాటం కొత్త కాదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు కేసీఆర్ వైపే చూస్తున్నారని తెలిపారు.




## మోసపోతే గోసపడతరు

(మొదటి పేజీ తరువాయి..)

కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి అన్ని గ్రా మాలు, తండాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించింద న్నారు. ఉచిత బస్సు హామీ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెసకు మొదటి హెచ్చరిక జారీ చేసేదే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితమని అన్నారు. ఈ ఉపఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పోదని, కానీ ప్రశ్నించే గొంతును గెలిపించాలని కోరారు. పదేళ్ల నిజం, ఆరు నెలల అబద్ధం మీ ముందు ఉన్నాయని, పట్టభద్రులు ఆలోచన చేయాలన్నారు. తనపై 54 క్రిమినల్ కేసులు ఉన్నాయని తీన్మార్ మల్లన్నే ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్నారని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి గోల్డ్ మెడలిస్ట్ అని, కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలర్ అని కేటీఆర్ అన్నారు.



**ఆర్టీసీ ఎండీని కోర్టుకు లాగుతాం..**

అధికారంలో ఉన్న వారి మాటలు విని వేధిస్తే కోర్టుకు లాగుతామని డీజీపీ రవిగుప్తా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్లను కేటీఆర్ హెచ్చరించారు. ఆర్టీసీ కొత్తలోగో ప్రచారం విషయంలో బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం పట్ల శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఆర్టీసీ కొత్తలోగో అంటూ ప్రచారం చేసిన ఎన్టీవీ, బిగ్టీవీ చానెళ్లు, వెలుగు దినపత్రికపై కేసులు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. నిజాలను బట్టబయలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతున్నారు.. మరి నకిలీవార్తలు ప్రచారం చేస్తున్న సీఎంను జైల్లో ఎందుకు పెట్టరని పోలీసులను ప్రశ్నించారు.

## జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

(మొదటి పేజీ తరువాయి..)

అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన అడ్మిషన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. జూన్ 27వ తేదీ నుంచి ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. మొదటి దశ కౌన్సెలింగ్లో భాగంగా జూన్ 27 నుంచి జూలై 5 వరకు అభ్యర్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 29 నుంచి జూలై 6 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, జూన్ 30 నుంచి జూలై 8 వరకు సీట్లకు సంబంధించిన వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 12న మొదటి దశ సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు జూలై 12 నుంచి 16 వరకు ఫీజు చెల్లించడంతోపాటు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూలై 19 నుంచి రెండో దశ కౌన్సెలింగ్ మొదలుకానుంది. ఈ దశలో జూలై 24న సీట్లను కేటాయించనున్నారు. జూలై 30 నుంచి తుది దశ కౌన్సెలింగ్ మొదలవుతుంది. ఈ దశలో ఆగస్టు 5న సీట్లను కేటాయిస్తారు. ఆ తర్వాత కూడా భర్తీ కాకుండా సీట్లు మిగిలితే వాటి భర్తీ కోసం ఆగస్టు 17న స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను నిర్వహించనున్నారు.

## అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి..)

రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. జీలుగు విత్తనాలు ఇవ్వడం లేదని హరీష్ రావుకు రైతులు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా హరీశ్రావు మాట్లాడుతూ.. రైతుల ఫోన్ నుంచి తల్లాడ ఏవోకు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులకు జీలుగు విత్తనాలు ఎందుకు ఇవ్వడం లేదంటూ ఏవోను హరీష్ రావు ప్రశ్నించారు. రైతులకు రేపటి నుంచి జీలుగు విత్తనాలు సరఫరా చేస్తామని ఏవో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు ఇస్తానన్న రుణమాఫీ నేటికీ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ధాన్యానికి ఇస్తానన్న బోనస్ నేటికీ అమలు కాలేదన్నారు. రేవంత్ ప్రభుత్వం బోనస్ అమలు చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రైతులతో కలసి అసెంబ్లీ ముట్టడిస్తామని హరీశ్రావు హెచ్చరించారు.

## ప్రపంచస్థాయి నగరాల్లో హైదరాబాద్..

(మొదటి పేజీ తరువాయి..)

ఇదిలావుంటే తాజాగా 'ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ 2024' పేరుతో విడుదల చేసిన నివేదికలో హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరాల జాబితాలో చోటు సంపాదించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా 564వ స్థానంలో ఉంది. గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచంలోని అగ్ర నగరాల జాబితాలో ఢిల్లీ గ్లోబల్ ర్యాంక్ 350 సాధించింది. ఇండియాలో తొలిస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా, ఈ జాబితాలో న్యూయార్క్ అగ్రస్థానంలో ఉంది. స్వతంత్ర ఆర్థిక సలహా సంస్థ ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ ర్యాంక్ ఇచ్చిన భారతదేశంలోని టాప్–10 నగరాల జాబితాలో హైదరాబాద్ 9వ స్థానంలో నిలిచింది. ఎకనామిక్స్, హ్యూమన్ క్యాపిటల్, జీవన నాణ్యత, పర్యావరణం, పాలన నాలుగు అంశాల ఆధారంగా ర్యాంకింగ్స్ రూపొం దించబడ్డాయి. నాలుగు ఇండెక్స్లో హైదరాబాద్ ఎకనామిక్స్లో అత్యుత్తమ పనితీరు కనబరిచింది.

# ఉమ్మడి అమ్రాబాద్‌లో ఇంత మోసమా?

- ఒకేసారి కళ్ళు చెదిరే రూ.12కోట్ల కుంభకోణం
- సీఐడీ అధికారుల నిఘా...
- సీఐడీ సీఐ సైదులు బృందం వంకేశ్వరంలో విచారణ
- మాకు డబ్బులు ఇవ్వలే మొత్తం కాజేశారని ఫిర్యాదు!








**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-చారగొండ వెంకటేష్ మే 24:**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గం తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు ఆనాటి ఉమ్మడి అమ్రాబాద్ మండలం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమ్రాబాద్, పదర మండలాలుగా విడిపోయాయి. నాడు 2017, 2018, 2019 సం.లలో సింగిల్ విండో రుణాల్లో సుమారు రూ. 12 కోట్లకు పైన అవకతవకలు జరిగినట్టు గతంలోనే అప్పటి అధికారులు గుర్తించారు. ఇంత పెద్ద మొత్తంలో అవినీతి అక్రమాలు జరిగిన, అచ్చంపేటలోని 2023లో నమోదైనా 420 కేసు ఆధారంగా 1827 ఖాతా దారుల పేర్లపై తీసుకున్న సింగిల్ విండో రుణాల్లో రూ. 12 కోట్లకు పైగా అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు రావడం జరిగింది గుర్తించారు. ఈ కేసును సిఐడికి బదిలీ చేయడం జరిగింది. ఇట్టి భారీ కుంభకోణంపై సిఐడి ఇన్స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో సిఐడి బృందంతో పాటు సంబంధిత అధికారులు శుక్రవారం పదర మండలం వంకేశ్వరం గ్రామంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. సింగిల్ విండో లోన్లలో అవకతవకలపై సిఐడి ప్రత్యేక బృందం డిఎస్పీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందలుగా ఏర్పడి అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాలలో ఉన్న 1827 ఖాతా దారుల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా పదర మండలంలోని వంకెశ్వరం గ్రామంలో ఉన్న ఖాతాదారుల వివరాలు సేకరిస్తున్నట్టు, విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోబడతుందని వారు తెలిపారు.



## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- అంతర్జాతీయ కరాటే పోటీలో గోల్డ్ మెడల్ విజేత సాయి కుమార్‌ను అభినందించిన కాంగ్రెస్ నాయకుడు శ్రీ గణేష్

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్:**

మలేషియాలో జరిగిన 20వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో కంటోన్మెంట్ లోని బాలంరాయి కి చెందిన యం. సాయి కుమార్ మలేషియా క్రీడాకారులు ఓడించి, విజేతగా ప్రథమ స్థానం గెలిచి బంగారు పతకం సాధించాడం భారతదేశానికి గర్వకారణం అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ గణేష్ తెలిపారు. ఈ పోటీలు మే 10 నుండి 12 వరకు మలేషియాలో జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు శ్రీ గణేష్, సాయి కుమార్ ను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ... మార్షల్ ఆర్ట్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయి కి పెంచుతున్న క్రీడాకారులను తాను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తానని ఆయన అన్నారు. అనంతరం సాయి కుమార్ మాట్లాడుతూ, తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు రాములు, శోభ, మాస్టర్ కలిమ్ లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఆయన అన్నారు.




## ఎల్లగొని రోశయ్య గౌడ్ పంచ విశంతి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

- రోశయ్య ట్రస్టు వ్యవస్థాపకులు ఎల్లగొని పాండురంగ గౌడ్, వెంకటేష్ గౌడ్ ,ప్రకాష్ గౌడ్

**నేటి ఫోకస్ న్యూస్, నాచారం:**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ ఎల్లగోని రోశయ్య గౌడ్ పంచ విశంతి వర్ధంతి సందర్భంగా వారి కుమారులు రోశయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎల్లగొని పాండురంగ గౌడ్, వెంకటేష్ గౌడ్, ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారుగా 300 మందికి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు అదేవిధంగా 300 మందికి స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మా తండ్రి ఎల్లగోని రోశయ్య గౌడు వర్ధంతి సందర్భంగా సుమారుగా 300 మందికి అన్నదానం చేయడం మజ్జిగ వితరణ చేయడం మా తండ్రి గారి పేరు ముద్రించిన స్టీల్ ప్లేట్లు పంపిణీ చేయడం జరిగింది ఇవే కాకుండా రోశయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో వివిధ కార్యక్రమాలు చేపడతామని వారు అన్నారు ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు సాయి జన్ శేఖర్ హాజరై రోశయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఊటుకూరి కుమార్, కట్ట బుచ్చన్న గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.





**నకిలీ విత్తనాల పట్ల రైతులు**

# అప్రమత్తంగా ఉండాలి

## మండల వ్యవసాయ అధికారి సర్వసుద్ది సరిత

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు మే 24:**



మండల పరిధిలో బోనకల్, రావినూతల, రాయన్నపేట, కలకోట, చిరునోముల, రామాపురం, తూటికుంట్ల, నారాయణపురం, చిన్నబీరవల్లి గ్రామాలలో విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహించారు.ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు అవసరమైన విత్తనాల కొనుగోలు విషయంలో రైతు సోదరులు సరైన అవగాహన కలిగి ఉండాలి తద్వారా భవిష్యత్తులో జరిగే పంట నష్టాలకు తగిన పరిహారాన్ని పొందవచ్చు.వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విక్రయిదారుల నుండి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదు.బిజి-3 పేరుతో చలామణి అవుతున్న టి హెచ్ పత్తి విత్తనాలకు (జి.ఈ.ఏ.సి) అనుమతి లేనందున ఈ రకం విత్తనాలను కొనడం, అమ్మడం మరియు సాగు చేయడం నేరము.నిర్ణీత ఫార్మాట్ లో ఉన్న బిల్లు (రసీదు) అనగా దుకాణదారుని అడ్రస్ పేరు సీడ్ లైసెన్స్ నంబరు జిఎస్టి నంబరు మొదలగునవి ఉన్న రసీదును మాత్రమే రసీదుగా అంగీకరించాలి.కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలి, రసీదు పై విత్తన కంపెనీ పేరు విత్తన రకంపేరు, లాట్ నెంబరు,గడువు తేదీ మరియు డీలర్ సంతకము తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.గుడ్డ సంచులు మరియు పగిలిన పాకెట్లు డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదు.గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితులలో కొనరాదు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్ సంచి డబ్బాలపై సీలు ఉందా లేదా అని సరిచూసుకోవాలి. విత్తన పాకెట్లపై ముద్రించిన సమాచారాన్ని బిల్లులో ఉన్న వివరాలతో సరిచూసుకోవాలి. బీటీ కాటన్ విత్తన ప్యాకెట్లపై జి ఈ ఏసి అప్రూవల్ నెంబర్ తేదీ మరియు సదరన్ జోన్ అనగా తెలంగాణ రాష్ట్రంలో సాగు చేయుటకు అనువైనదో కాదో విత్తన పాకెట్ పై ఉన్న సమాచారంలో సరి చూసుకోవాలి.విత్తన ప్యాకెట్ను మరియు బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవడం తద్వారా జన్యు స్వచ్ఛత లోపాల వల్ల లేదా మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుంది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎర్రగుంట సాధన, ధారగాని కళ్యాణి, మరీదు త్రివేణి, బద్దల కార్తిక్, మురికిపుడి తేజ, నాగినేని నాగసాయి, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ సమస్యలపై సీఈఓకు వినతి..

- రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలి
- వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి
- 20 లక్షల ఎక్స్గ్రేషియా తక్షణమే ప్రకటించాలి
- తెలంగాణ ఉద్యమకారుల హక్కుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు మూల్యా సంజీవ్

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని డ్రైనేజీ, కరెంట్ పోల్స్, త్రాగునీరు సమస్య, వివిధ అనేక సమస్యలు ఉన్నాయని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, మరియు కంటోన్మెంట్ హాస్పిటల్ కు వైద్యానికి వెళ్లిన రవీందర్ పై భారీ వృక్షం విరిగిపడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్య సరళ దీవికి తీవ్ర గాయాలు కావడం జరిగిందాని, ఆ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం 20 లక్షల ఎక్స్గ్రేషియా తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెల్లించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని, తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూల్యా సంజీవ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మూల్యా సంజీవ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి 5 వేల కోట్లు కేటాయించుకున్నారని సీఈఓ మధుకర్ నాయక్‌ను సంజీవ్ కోరారు.

## భవాని నగర్ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించండి

**నేటి ఫోకస్ న్యూస్, నాచారం:**

నాచారం డివిజన్ పరిధిలో ఉన్న భవాని నగర్ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అలాగే భవాని నగర్ కాలనీ లో 3,4,5, వీధి నెంబర్ లో డ్రైనేజీ పైప్ లైన్ చిన్నదిగా ఉండటం వలన మురికి నీరు రోడ్డు మీదకి ప్రవహించడంతో కాలనీ ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు దీనికి వెంటనే డ్రైనేజీ పెద్ద పైపులైన్ వేయించాలని, వీధి నెంబర్ 1,3,4,5,లో రోడ్లు సీసీ రోడ్లు గత 20 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు పాడైపోయినవి వెంటనే కొత్త సిసి రోడ్లు వేయాలని అలాగే భవాని నగర్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ చిన్నదిగా ఉండటం వలన సరిపోవడం లేదు దానిపైన ఒక అంతస్తు వేయించాలని భవాని నగర్ వీధి నెంబర్ 5 లో సుమారుగా 75 గజాల ఖాళీ స్థలం ఉన్నది ఈ స్థలంలో మహిళలకు ఉపయోగపడే విధంగా మహిళా భవనము నిర్మించాలని కాలనీలో ఉన్న పలు సమస్యలపై స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది దీనికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే మీ కాలనీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు అనంతరం నూతనంగా ఎన్నికైన భవాని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్ రెడ్డితో పాటు సభ్యులందరినీ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమములో భవాని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అశోక్, ఆనంద్ కుమార్, కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేందర్, శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ, టి హెచ్ రాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.









## పలు కార్యక్రమాలకు హాజరైన డాక్టర్ కోట రాంబాబు

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,మధిర మే 24:**

మొదటిగా మధిర మున్సిపాలిటీ లోని జిలగుమాడు గ్రామంలో 1 వ వార్డు కౌన్సిలర్ పగిడిపల్లి కాశీరావు విజయమ్మ దంపతుల కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మధిర లోని ఎస్సీ కాలనీ నందు 11 వ వార్డు కౌన్సిలర్ గద్దల మాధురి అత్త గద్దల ప్రశాంతమ్మ ఇటీవలే అకాల మరణం పొందగా వారి దశధిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వివిధ హెూదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీ.జే.పీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం..

- మిర్యాలగూడ అసెంబ్లీ ఇంచార్జి సాధినేని శ్రీనివాస్

**దామరచర్ల (నేటి ఫోకస్ న్యూస్) మే 24:**

దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్దనున్న వై.టి.పి.యస్ (యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్) నందు





పట్టభద్రులను కలిసి యమ్.యల్.సి పట్టభద్రుల ఎన్నికల ప్రచారం నిర్వహించి బీ.జే.పీ అభ్యర్థి శ్రీ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో బీ.జే.పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ అలె భాస్కర్, మిర్యాలగూడ అసెంబ్లీ ఇంచార్జి సాధినేని శ్రీనివాస్, కన్వీనర్ సజ్జల నాగిరెడ్డి, అసెంబ్లీ ప్రభారీ లచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జానకిరామ్ రెడ్డి, నిమ్మల విజయ్, హనుమ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ సంఘాల మహాకూటమి సమీక్ష సమావేశం

**మిర్యాలగూడ (నేటి ఫోకస్ న్యూస్) మే 24:**

గత 30 సంవత్సరాలుగా మాదిగ సంఘాలను అధికారానికి దూరం చేసి వారిని అణచివేసే కుట్రలు చేశారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, దూరం చేశారని మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ శ్రీ పోకల కిరణ్ ఆరోపించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాల మాదిగ సంఘాల మహాకూటమి సమీక్ష సమావేశం మిర్యాలగూడ గాంధీభవన్లో మహాకూటమి నాయకులు పోలేపల్లి ఉదయ్ కుమార్, పోకల రవికుమార్, మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశానికి శ్రీ పోకల కిరణ్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ ఉప కులాల ప్రజలను రాజ్యాధికారానికి దూరం చేసి అణగదొక్కాలని చూస్తున్నారు. అందుకే మాదిగ సంఘాలను మహాకూటమి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో కుల గణనను చేపట్టి జనాభా దామాషా ప్రకారంగా రిజర్వేషన్లు కేటాయించి ప్రకటించాలన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న కోటి మంది మాదిగ ఉప కులాల ప్రజలను గౌరవించి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా హక్కులు పొందేందుకు ప్రతి ఒక్కరూ మహాకూటమి పక్షాన నిలబడేందుకు గ్రామ, మండల, డివిజన్, కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత 30 సంవత్సరాలుగా రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ప్రజలను చైతన్యం చేసుకొని సంక్షేమ పథకాలు పొందే విధంగా మాదిగల హక్కులు సాధించుకోవాలని తెలిపారు. మహాకూటమి చైర్మన్గా ఎన్నుకోబడినందుకు మిర్యాలగూడ పక్షాన గజమాలతో సత్కరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాకూటమి నాయకులు తలకుప్పుల సైదులు, ఉర రామకృష్ణ, గూడపూరి శ్రీను, పోలేపల్లి ఉదయ్ కుమార్, పోకల రవికుమార్, పుట్ట జంగన్న, బి. సైదులు, గోసంగి శ్రీను, అలంపల్లి నాగేశ్వర రావు, పరంగి సురేష్, దైద రవి, బొంగరాల వెంకటయ్య, మంద శ్రీను, పోకల నాగయ్య, సైదులు, వెంకన్న, దైద రవి, మత్స శామ్ తదితరులు పాల్గొన్నారు.





# కృతి సనన్ పదేళ్ల సినీ ప్రయాణం


బాలీవుడ్‌లో తన తొలి సినిమా విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నటి కృతి సనన్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టా రు. బాలీవుడ్ చిత్రంతో 'హీరో పంటీ'తో కృతీ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వా త బీటౌన్‌లో వరుస సినిమాలు చేస్తున్నారు. తన పదేళ్ల కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ పోస్ట్ పెట్టారు. హిందీ పరిశ్రమకు వచ్చి 10 ఏళ్లు గడిచాయంటే నమ్మలేకపోతున్నా. నిన్ననే మొదటిసారి సెట్‌లోకి అడుగుపెట్టానేమో అనిపిస్తుంది. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకు న్నాను. మంచి స్నేహితులను, మరిచిపోలేని జ్ఞాపకాలు సొంతం చేసుకున్నా. నా ప్రయా ణంలో భాగమై నన్ను ఆదరించిన అందరికీ, నన్ను నమ్మి ప్రోత్సహించిన దర్శకనిర్మాతలకు ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలు. పెద్ద కలలు కనాలి. వాటిని నిజం చేసుకునేందుకు కృషి చేయాలి. నేనూ అదే చేశాను. నా ప్రయాణంలో మరె న్నో అద్భుతాలు చూడాలనుకుంటున్నా అని రాశా రు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పాత్రల గురించి కృతి మాట్లాడుతూ సవాల్‌తో కూడిన పాత్రలంటే తనకు ఇష్టమని అన్నారు. రోజూ కొత్తగా ప్రయత్నించే అవకాశమున్న ఇండస్ట్రీలో ఉన్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకో వాలని.. ఇక్కడికి రావాలి, కలలు కనేవారికి స్ఫూర్తిగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కృతి 'దో పత్తీ'తో బిజీగా ఉన్నారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిలిమ్స్' పతాకంపై ఆమె నిర్మించనున్న తొలి చిత్రమిది.



# చిరు విశ్వంభరలోకి ఆషికా రంగనాథ్

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం విశ్వంభర సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో త్రిష ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మరో భామ విశ్వంభర టీంతో జాయిన్ అయింది. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర టీంతో ఆషికా రంగనాథ్ ప్రయాణం మొదలు పెట్టబోతుంది. బ్లాక్ బస్టర్ ఎక్స్‌పీరియన్స్ కోసం సిద్ధంగా ఉండండి.. అంటూ ఆషికా రంగనాథ్‌కు స్వాగతం పలుకుతూ షేర్ చేసిన లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఏడాది నా సామి రంగ చిత్రంలో నాగార్జునకు జోడీగా మెరిసింది ఆషికా రంగనాథ్. మరి ఈ భామ విశ్వంభరలో ఎలాంటి పాత్రలో కనిపించబోతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. తాజా అప్‌డేట్‌తో మెగాస్టార్ జెట్ స్పీడులో సినిమా పూర్తి చేసేలా ఉన్నాడని ఫుల్ ఖుషీ అవుతున్నారు చిరంజీవి అభిమానులు, మూవీ లవర్స్. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఆర్‌ఆర్‌ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ మూవీని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.






# 31న వస్తున్న గంగం గణేశా

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గం..గం..గణెళిశా' . ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మూవీ సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ సినిమాకు యూ/ఎ సర్టిఫికెట్‌ను అందించారు. ఓవైపు కామెడీతో పాటు రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రగతి శ్రీవాస్తవ, ఎన్ సారిక ఈ చిత్రంలో కథానాయికలుగా నటిస్తుండగా.. ఇమ్మాన్యుయేల్, వెన్నెల కిషోర్, రాజ్ అర్జున్, సత్యం రాజేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ఇండియాకు అవార్డు




77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇండియాకు అవార్డు దక్కింది. మైసూరుకు చెందిన ఫిల్మ్‌మేకర్ చిదానంద ఎస్ నాయక్‌ను అవార్డు వరించింది. సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్స్ టు నో అనే ఫిల్మ్‌కు లా సినెఫ్ అవార్డు దక్కింది. పూణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో టెలివిజన్ వింగ్‌లో ఆయన ఏడాది కోర్సు చేశారు. దానిలో భాగంగా తీసిన సన్ ఫ్లవర్స్ చిత్రానికి ఆ అవార్డు దక్కింది. కన్నడ జాన పదులకు చెందిన ఓ మహిళ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లా సినెఫ్ మూడవ బహుమతి కూడా భారతీయులకే దక్కింది. బన్నీవుడ్ అనే యానిమేషన్ చిత్రం తీసిన భారతీయ సంతతి మహిళ మాన్సీ మహేశ్వరిని అవార్డు వరించింది. మీరట్‌లో మహేశ్వరి జన్మించారు. ఎన్ఐఎఫ్‌టీ ఢిల్లీలో ఆమె విద్యాభ్యాసం చేశారు. యూకేలోని నేషనల్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ స్కూల్లో కూడా ఆమె చదివారు. లా సినెఫ్ అవార్డుల్లో రెండో ప్రైజ్‌ను కొలంబియా యూనివర్సిటీ డైరెక్టర్ ఆస్యా సెగలోవిచ్‌కు దక్కింది. ఫస్ట్ ప్రైజ్ గెలిచిన వారికి 15000 యూరోలు గ్రాంట్ ఇస్తారు. రెండో ప్రైజ్ విన్నర్‌కు 11,250 యూరోలు, మూడవ ప్రైజ్ విన్నర్‌కు 7500 యూరోలు దక్కుతాయి. అవార్డు దక్కిన సినిమాలను జూన్ 3వ తేదీన సినిమా దు పాంథియన్ థియేటర్‌లో స్క్రీన్ చేస్తారు. గడిచిన అయిదేళ్లలో లా సినెఫ్ అవార్డుల్లో ఇండియాకు ఫస్ట్ ప్రైజ్ దక్కడం ఇది రెండో సారి. 2020లో ఎఫ్‌టీఐఐకి చెందిన అస్మితా గుహ నియోగికి అవార్డు దక్కింది. ఆమె క్యాట్ డాగ్ అనే చిత్రాన్ని తీశారు.